బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్



నియామకపత్రం అందుకుంటున్న అరుణ్‌కుమార్

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి సుభాష్‌చంద్ర చేతుల మీదుగా శనివారం హైదర్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కళామందిర్ బస్టాప్ జాతీయ రహదారిపై వీరూ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లబ్ధిదారుని కుటుంబ సభ్యురాలికి శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. మోతీనగర్‌కు చెందిన టి. సుదర్శన్ బాబు కేన్సర్‌తో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన రూ.3 లక్షల చెక్కును అందజేశారు.



పాపిరెడ్డినగర్‌లోని ఫిలడెల్ఫియా ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో జరిగిన సమ్మర్ క్యాంప్ ర్యాలీలో పాల్గొన్న చంద్రారెడ్డి, విద్యార్థులు తదితరులు

– ఆల్విన్‌కాలనీ

లేక్ వ్యూ.. మురుగుమయం

- కాలనీలో ఇళ్లముందు పారుతున్న డ్రైనేజీ
- సమస్య పరిష్కరించాలని పలుమార్లు వినతి
- పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



ఇళ్లముందు ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని లేక్ వ్యూ కాలనీ రోడ్డు నంబర్ 1లో మురుగు సమస్యతో స్థానికులు సతమతమవుతున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్ల నుంచి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్ల ముందు మురుగు ప్రవహిస్తుండటంతో ఆరు బయటకు రావాలంటే అసౌకర్యంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. బయటకు వస్తే దుర్వాసన భరించలేకపోతున్నామని ఇక ఈగలు, దోమలతో అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మురుగునీరు తోడవడంతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొందని స్థానికులు మొర పెట్టుకుంటున్నారు. రోడ్డు కూడా శిథిలావస్థకు చేరటంతో గుంతలలో మురుగు నీరు చేరటంతో వాహనాల రాకపోకల సమయంలో చిందిపడుతుండడంతో గొడవలకు దిగుతున్నారని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలిచ్చినా పరిష్కరించడం లేదన్నారు. ఇంటి పన్నులు వసూలు చేయటంలో ఉన్న శ్రద్ధ వసతుల కల్పనలో ప్రభుత్వ లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు లేక్ వ్యూ కాలనీలో పర్యటించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రహదారుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మురుగునీటితో సహవాసం



లేక్ వ్యూ కాలనీ రోడ్డు నంబర్1లో సెంట్రల్ డ్రైనేజీ సిస్టం లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగునీరు ప్రవహిస్తున్నది. కొన్ని నెలలుగా మురుగునీటితో సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దుర్వాసనతో సతమతమవుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– సురేందర్‌రెడ్డి, లేక్‌వ్యూ కాలనీవాసి

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

- పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత

ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌లకు చెందిన 71 మందికి శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడబిడ్డకు పెద్ద అన్నలాగా నిలుస్తున్నారన్నారు. నిరుపేద ఆడబిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, ప్రసాద్, దొడ్ల రామకృష్ణ గౌడ్, శ్రీధర్ రెడ్డి, బాలనర్సయ్య, అక్కిరెడ్డి, నిఖిల్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



డ్రైనేజీని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించి అభివృద్ధిలో ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. లేక్‌వ్యూ కాలనీలో అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేక్ వ్యూ కాలనీలో సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించాలన్నారు. వీధి దీపాల సమస్యను కూడా వెంటనే సరి చేయాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ కాలనీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సంజీవరావు, ఎలక్ట్రికల్ సుధాకర్, వాటర్ వర్క్స్ సూపర్‌వైజర్ నరేంద్ర చారి, సిబ్బంది వాటర్ లైన్‌మెన్ శ్రీకాంత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పూడ్చివేత!

- అడ్డుకున్న స్థానికులు
- పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారావు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ రాఘవేంద్ర సొసైటీ వద్ద, కైత్లాపూర్, సేవాలాల్‌నగర్ మధ్యలో ఉన్న శ్మశాన వాటికని మట్టితో పూడ్చివేస్తుండగా శనివారం స్థానికులు అడ్డుకున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో హిందూ శ్మశాన వాటిక ఉందని, ఇప్పుడు హైడ్రా అధికారులు చెరువుల పూడికతీత మట్టితో పూడ్చడం సరికాదన్నారు. తెర వెనుక ఉదాసీన్ మఠంకు చెందిన పలువురు ఉన్నారని స్థానికులు ఆరోపించారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో కూడా శ్మశాన వాటిక 20 ఎకరాల్లో ఉందని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావుతో కలిసి పరిశీలించారు. వెంటనే మట్టిని డంప్ చేయటం నిలిపివేయాలని, త్వరలోనే హైడ్రా అధికారులు, ఉదాసీన్ మఠం నిర్వాహకులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శంకర్, సంతోష్, కైలా, కృష్ణ, యాదయ్య, నాగేష్, స్వామి, భీమ్‌రావ్, బీరప్ప, రతన్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ సబిహా బేగం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం

మోతీనగర్: సున్నం చెరువు సుందరీకరణ పనులను రాబోయే వర్షాకాలంలోగా పూర్తి చేయాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని సున్నం చెరువులో హైడ్రా చేపడుతున్న సుందరీకరణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, గాయత్రినగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు పెసర సంజీవరెడ్డి, బీఆర్ఎస్ అల్లాపూర్ డివిజన్ సోషల్ మీడియా అధ్యక్షుడు యోగిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లులు మాల్‌లో రీడర్స్ ఫెస్ట్ ప్రారంభం



ఫెస్ట్‌ను ప్రారంభించిన నటి ప్రేరణ, ప్రకృతి తదితరులు

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలోని లులు మాల్‌లో 'లులు రీడర్స్ ఫెస్ట్'ను శనివారం బిగ్ బాస్ ఫేమ్ ప్రేరణ, ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ 2024 విజేత ప్రకృతి ప్రారంభించారు. తనకు పుస్తకాలంటే ఎంతో ఇష్టమని ప్రేరణ తెలిపారు. హ్యారీపాటర్ పుస్తకమంటే ఎంతో ఇష్టమని, పుస్తకాలు చదవటం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. పుస్తక ప్రదర్శన ఈ నెల 14వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఫిక్షన్, సాహిత్యం, స్వీయ చరిత్ర, నవలలు, చిన్న పిల్లల పుస్తకాలు లభిస్తాయని, 50 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు.

5 నుంచి పాలిసెట్‌పై ఉచిత శిక్షణ

రాయదుర్గం: పాలిసెట్–2025పై ఉచితంగా వారం రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ) ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ శనివారం తెలిపారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీ క్యాంపస్‌లో ఈనెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని, పాలిసెట్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ప్రవేశ పరీక్షపై అవగాహన కల్పించడం, మార్కుల సాధన కోసం ఈ ప్రత్యేక క్రాష్ కోచింగ్ ఇవ్వడానికి నిర్ణయించినట్లు వివరించారు.

నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలన

కూకట్‌పల్లి: నీట్ పరీక్షా కేంద్రం అడ్రస్ తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి పరీక్షా హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ కిట్లు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన ఏర్పాట్లన్నీ సజావుగా పూర్తి అయ్యాయా?, లేదా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్ వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, అధికారులు, ఆర్డీఓ శ్యాంప్రకాష్, పోలీస్ అధికారులు, పరీక్షా కేంద్రాలకు డ్యూటీ మెజిస్ట్రేట్‌గా నియమించిన కూకట్‌పల్లి, దుండిగల్, బాలానగర్ మూడు చింతలపల్లి, ఘట్‌కేసర్, మల్కాజిగిరి తహసీల్దార్లు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ గౌతమ్

పంటల సాగుపై రైతులకు అవగాహన

మేడ్చల్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ



సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలం పంట సాగుకు రైతులను సమయాత్తం చేసేందుకు వ్యవసాయశాఖ కార్యాచరణ రూపొందించిందని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరుతో సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పంట సాగుబడి, పాడిపంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాలో రైతులు ఇప్పటికే వర్షాకాలం పంటసాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఎరువుల వినియోగంతో ఆర్థికంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా చైతన్య కార్యక్రమాలను నిర్వహించటానికి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరుతో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందన్నారు. పంట సీజన్ సమయంలో రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వెళ్లడంతో చాలా సమస్యలకు పరిష్కార మార్గం లభించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ తెలిపారు. ఈ నేపథ్యంలోనే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో సోమవారం నుంచి జూన్ 16 వరకు ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పేదలకు విద్య అందేనా..?

- హైకోర్టు ఆదేశాలతో నిరుపేద కుటుంబాల్లో ఆశలు
- నగరంతో సహా శివారు జిల్లాల్లో 5,094 ప్రైవేట్ స్కూల్స్
- లక్ష మందికి పైగా పేద విద్యార్థులకు అందనున్న ఉచిత విద్య

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు నిరుపేదలు, దివ్యాంగులకు కేటాయించి ఉచిత విద్యను అందించాలని నిబంధనలు చెబుతున్నాయి. వాటి అమలు మొన్నటి వరకు కాగితాల్లో లెక్కలకే పరిమితమైంది. తాజాగా 2025 జూన్ నుంచి అమలు చేస్తామని హైకోర్టుకు ప్రభుత్వం లిఖితపూర్వకంగా తెలిపిన నేపథ్యంలో విధివిధానాల తయారీకి కసరత్తు మొదలు పెట్టింది. దీంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇన్నాళ్లూ దక్కని హక్కు ఇక తమకు చేరబోతుందనే సంతోషం బలహీన వర్గాల కుటుంబాల్లో కనిపిస్తోంది. – సాక్షి, సిటీబ్యూరో



15 ఏళ్లుగా నిరీక్షణ..

2009లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయగా.. సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా 25 శాతం మంది పిల్లలను చదివించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఉచిత నిర్బంధ విద్యలో భాగంగా ఈ చట్టాన్ని పక్కాగా కార్యాచరణలో చూపించాల్సి ఉంటుంది. జీవో 44 ప్రకారం అనాథలు, ఎయిడ్స్ బాధిత చిన్నారులు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లు అందించాలని అప్పట్లోనే నిర్ణయించారు. అయినా ఎక్కడా ఈ విధానం అమలు కావడం లేదు.

అధిక ఫీజులతో అవస్థలు

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మాత్రం ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యం ముక్కుపిండి రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. టెక్నో, కార్పొరేట్ పాఠశాలల పేరుతో వసూలు చేస్తున్న ఫీజులు, డొనేషన్లకు లెక్కలేకుండా పోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యాహక్కు చట్టం అమలైతే..

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో మొత్తంగా 8,029 వరకు పాఠశాలలు ఉండగా.. ఇందులో 5,094 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రైవేట్ పాఠశాలల్లో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 1,611 ఉండగా.. రంగారెడ్డి జిల్లాలో 1,581, హైదరాబాద్ జిల్లాలో 1,902 ఉన్నాయి. ఈ ప్రైవేట్ పాఠశాలల పరిధిలో వందలాది మంది విద్యార్థులు ఫీజులు చెల్లించి చదువుకొంటున్నారు'.

పేదలకు చేరువగా విద్య

ఒక్కో ప్రైవేటు పాఠశాలలో కనిష్ఠంగా 200 నుంచి గరిష్ఠంగా 1000 మంది విద్యార్థుల వరకు చదువుతున్నారు. అందులో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తే.. గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో లక్ష నుంచి రూ.1.50 లక్షల మంది నిరుపేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉండగలదని పేర్కొంటున్నారు. ప్రైవేటు పాఠశాలలు ఇకపై ఉచితంగా సీటు పొందిన విద్యార్థి పూర్తి వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది.

విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే

ఓల్డ్ బోయిన్‌పల్లి: విద్యార్థులు 10వ తరగతిలో తమ సత్తా చాటి అటు తల్లిదండ్రులకు, ఇటు పాఠశాలలకు మంచి పేరు తేవడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని రెయిన్‌బో హైస్కూల్‌లో స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగూరుబాబు, దివ్యభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో కార్పొరేటర్ నర్సింహయాదవ్‌తో కలిసి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, హరినాథ్, నర్సింగ్‌రావు, జంగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

నేటి నీట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

సాక్షి,సిటీబ్యూరో: వైద్య కళాశాలల్లో (ఎంబీబీఎస్, బీడీఎస్) ప్రవేశాలకు నేడు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష–2025 (నీట్)కు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు 4,336 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరకు పరీక్ష జరగనుంది. దివ్యాంగులకు ఓ గంట అదనపు సమయం ఉంటుంది. జిల్లాతో పాటు పొరుగు జిల్లాల వారు కూడా ఇక్కడ పరీక్ష రాయనున్నారు. ఉదయం 11 నుంచే కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

పోలీసుల బందోబస్తు..

ప్రతీ పరీక్ష కేంద్రానికి తహసీల్దారు డ్యూటీ మేజిస్ట్రేట్లుగా నియమించారు. గతేడాది నీట్ ప్రశ్నాపత్రం లీక్, అవకతవకలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నీట్ నిర్వహణపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. దీనిలో భాగంగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పోలీసులు నీట్‌కోసం భారీ బందోబస్తు, ముమ్మర తనిఖీలు చేయనున్నారు. పోలీస్ ఎస్కార్ట్ ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర కీలకసామగ్రిని కేంద్రాలకు తరలించనున్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కోచింగ్ సెంటర్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టారు.

నెగెటివ్ మార్కులు..

ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులను కేటాయిస్తారు. నెగెటివ్ మార్కులు ఉన్నందున తెలిసిన సమాధానాలే రాయాలని నిపుణులు సూచిస్తున్నారు. సమాన మార్కులు వస్తే.. నెగెటివ్ మార్కులు తక్కువ ఉన్న వారికే ర్యాంకులో ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ ర్యాంకు ద్వారా దేశ వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, బీవీఎస్, ఏహెచ్ సీట్లతో పాటు ఎయిమ్స్ సీట్లను భర్తీ చేస్తారు.